ప్రజాశక్తి
మంగళవారం 21 ఫిబ్రవరి 2023 5 అనంతపురం



పట్టభద్రుల స్థానానికి ఆరు నామినేషన్లు


మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం, కడప, కర్నూలు పశ్చిమ రాయలసీమ మండలి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం నాడు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో నామినేషన్ పత్రాలను ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ స్వీకరించారు. ఇందులో భాగంగా పట్టభద్రుల స్థానానికి ఆరు, ఉపాధ్యాయ స్థానానికి ఒక నామినేషన్ దాఖలు అయ్యింది. ఉపాధ్యాయ స్థానానికి సందె మాధవరావు నామినేషన్ వేశారు. ఇక పట్టభద్రుల స్థానానికి సంబంధించి పోతుల నాగరాజు, ఎం.ఆనంద్ కృష్ణ, పిల్లకదపు చంద్రశేఖర్, రాగిరి చంద్రప్ప, సల్కాపురం అమత్ కుమార్, నల్లాని రమేశ్ నాయుడులు నామినేషన్లు వేశారు.

మంగమ్మకు మండలి అవకాశం

స్థానిక సంస్థల కోటాలో వైసిపి అభ్యర్థిగా ప్రకటన


సానిపల్లి మంగమ్మ

ప్రజాశక్తి-పెనుకొండ

అనంతపురం జిల్లా స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా హిందూపురం మాజీ ఎంపీ సానిపల్లి గంగాధర్ సతీమణి సానిపల్లి మంగమ్మ పేరును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం పేరును ఖరారు చేశారు. బీసీ బోయ సామాజిక వర్గంలో బలమైన నేతగా మంగమ్మ కుటుంబం ఉంది. మంగమ్మ భర్త సానిపల్లి గంగాధర్ హిందూపురం పార్లమెంట్, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలకు సుపరిచితమైన నేత. పెనుకొండ నియోజకవర్గం గుట్టూరు సింగిల్ విండో అధ్యక్షునిగా ఈయన రాజకీయ అరంగేట్రం చేశారు. అనంతరం 1989, 1891, 1998 సంవత్సరాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి హిందూపురం ఎంపీగా గెలుపొందారు. 2006లో అనారోగ్యంతో గంగాధర్ కన్నుమూశారు. వైసిపి ఆవిర్భావం తరువాత గంగాధర్ కుటుంబ సభ్యులు ఆ పార్టీలో చేరారు. మంగమ్మ వైసిపి సమన్వయకర్తగా, సిఇసి సభ్యురాలుగా పని చేశారు. ఈమె కుమారుడు సానిపల్లి మహీధర్‌కు 2014లో పెనుకొండ మండల జడ్పీటీసీగా పోటీ చేయించి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించాలని వైసిపి భావించింది. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. అప్పటి నుంచి వారు రాజకీయాల్లో స్తబ్ధుగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో వైసిపి అధిష్టానం మంగమ్మను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రాజకీయ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

కమ్యూనిస్టులతోనే అట్టడుగు వర్గాల అభివృద్ధి

సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోయి అట్టడుగు వర్గాలు, శ్రామికులు, కార్మికులు, పేదలందరూ ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అభివృద్ధి సాధించి సమానంగా జీవించేలా అందరి హక్కులు కాపాడటమే కమ్యూనిస్టుల లక్ష్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. సోమవారం సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ పార్క్ సమీపంలో పార్టీ సభ్యులు, సానుభూతిపరులకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, మెరుగైన సమాజం కోసం, అందరూ బాగుండాలని కమ్యూనిస్టులు పోరాడుతున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు పేదలకు ఉండడానికి ఇల్లు, కట్టుకోవడానికి బట్ట, తినడానికి తిండి కల్పిస్తామని చెప్పి నేటికీ 75 సంవత్సరాలు అవుతున్నా వాటికి పేదలు దూరంగానే ఉన్నారని తెలిపారు. అందుకే సిపిఎం ఆధ్వర్యంలో పేదలకు ఒక గూడు ఉండాలని భూ పోరాటాలు చేసి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేస్తున్నట్లు వివరించారు. అయితే ఇప్పటి దాకా మనల్ని పరిపాలిస్తున్న పాలకులు పేదలను ఓట్లు వేసేవారుగానే చూస్తున్నారని, వారికి కనీస అవసరమైన గూడును కల్పించలేకపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వ స్థలాలను కొందరు కబ్జాలు చేస్తున్న రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవరిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో సమాజంలో మార్పు వచ్చేదాకా సిపిఎం పోరాడుతుందన్నారు. ఈ పోరాటాల్లో పేదలందరూ కలిసి రావాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, నగర నాయకులు ప్రకాష్, మసూద్, బాబు, వలీ, ప్రసాద్, ఎన్టీఆర్ శీనా, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు బాబు, వెంకటనారాయణ, రాజీవ్‌కాలనీ ఎంపిటిసి రమీజాబీ, రజక సంఘం నాయకులు నాగభూషణం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఆటో యూనియన్ నాయకులు శివ, నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు డేవిడ్, వెంకట, రామాంజి, షరీఫ్, శ్రీరామ్, వలీ, రఫీ, నాగేంద్ర, కృష్ణ, రవీంద్ర, ఐద్వా నాయకురాలు లాలెమ్మ, చంద్రకళ, మాబ్బీ, మాబ్జాన్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనపై అందరిలోనూ వ్యతిరేకత

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి పాలనపై అన్ని వర్గాల ప్రజల్లోనూ వ్యతిరేకత స్పష్టంగా కన్పిస్తోందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో క్లస్టర్లు, యూనిట్ ఇన్‌ఛార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సిఎం జగన్‌రెడ్డి వికృత చేష్టలతో అన్నిరంగాలు నాశనం అయ్యాయన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంతోపాటు వివిధ రంగాల్లో రాష్ట్రం గణనీయమైన ప్రగతిని సాధించిందన్నారు. అంతేగాకుండా అమరావతి, పోలవరం నిర్మాణాలకు అధిక ప్రాధాన్యమిస్తూనే, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు రూ.10వేలకోట్లు వెచ్చించారని గుర్తు చేశారు. అదే జగన్ సిఎం అయ్యాక వివి సాంకేతిక కారణాలు చూపుతూ అరకొర సంక్షేమ పథకాలు అందిస్తూ నిరుపేదలను మోసం చేస్తున్నాడన్నారు. ముఖ్యంగా జగన్ తన పాదయాత్రలో 45 ఏళ్లకే మహిళలకు ఫించన్లు ఇస్తానని, అమ్మఒడి, 25 లక్షల పక్కాఇళ్లు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మాయమాటలు చెప్పి అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. టిడిపి చేపడుతున్న బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లినప్పుడు, స్వయంగా మహిళలలే వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. సిపిఎస్ రద్దుపై పోరాడుతున్న ఉపాధ్యాయులపై జగన్‌రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాడన్నారు. ఇకపోతే ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి నాలుగేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ఇసుకను కర్ణాటకకు తరలించడం, పక్క రాష్ట్రం నుండి పెద్దఎత్తున అక్రమంగా మద్యం తీసుకొచ్చి రూ.కోట్లు గడించారని ఆరోపించారు. రాయదుర్గంలో చిల్లర దొంగ కాపు రామచంద్రారెడ్డి అని దుయ్యబట్టారు. టిడిపి గెలుపునకు ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్లు హనుమంతు, గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మోహన్‌రెడ్డి, పురుషోత్తం, ఇనాయత్, సన్నన్న, ఎంపిటిసిలు గంగాధర, మల్లికార్జున, రాయదుర్గం పట్టణం, రూరల్, గుమ్మఘట్ట, డి.హీరేహాల్ మండలాల యూనిట్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

'విశ్వ' అజ్ఞాన కేంద్రాలుగా మార్చొద్దు

◆ ఎస్‌కెయు పాలకవర్గ చర్యలు రాజ్యాంగ విరుద్ధం ◆ విసి, రిజిస్ట్రార్ తీరుపై మండిపడుతున్న పౌర సమాజం





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విశ్వ విద్యాలయాలంటే విజ్ఞాన కేంద్రాలుగా పిలుచుకుంటారు. సమాజాన్ని పురోగమనం వైపు నడిపించే కేంద్రాలుగా భావిస్తుంటారు. కొత్త కొత్త పరిశోధనలు, శాస్త్ర ఆలోచనలు నిత్యం సంఘర్షించాల్సిన చోట వెనుకబడిన ఆలోచనలను అమలుకు సిద్ధపడే విధంగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పాలకవర్గ పెద్దలు వ్యవహరించిన తీరుపై పౌర సమాజం మండిపడుతోంది. మృత్యుంజయ హోమం చేపడుతున్నట్టు ఎస్‌కెయు వైస్ ఛాన్సలర్ అధికారిక ప్రకటనివ్వడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారు. శాస్త్రీయ ఆలోచనల వైపు ప్రజలను నడిపంచాలని రాజ్యాంగం చెబుతుంటే, ఉన్నత విద్యా కేంద్రమైన విశ్వవిద్యాలయంలో ఇటువంటి చర్యలు చేపట్టడాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

మృత్యుంజయ హోమాన్ని నిలిపేయాలి
వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి

మూఢనమ్మకాలను పారదోలి విజ్ఞాన కేంద్రంగా విరజిల్లాల్సిన విశ్వవిద్యాలయంలో మృత్యుంజయ హోమం నిర్వహించేందుకు ప్రయత్నించిన ఎస్‌కెయు రిజిస్ట్రార్‌ను వెంటనే రీకాల్ చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ విజ్ఞాన కేంద్రమే కాక కుల, మత, ప్రాంతీయ భావాలకు అతీతమై ఉమ్మడి భావాలకు నిలయంగా ఉంటుందని చెప్పారు. వారి సొంత స్థలాల్లో వ్యక్తిగత విశ్వాసాలను ఆచరించడం ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. దీనికి విరుద్ధంగా ప్రభుత్వ స్థలాలు, అందులోనూ శాస్త్ర విజ్ఞానానికి కేంద్రంగా మారాల్సిన విశ్వవిద్యాలయంలో ఇలాంటివి జరపాలని ప్రయత్నించడం లౌకిక భావాలకే తీవ్ర ప్రమాదం అని చెప్పారు. ఎస్‌కెయు విసి, రిజిస్ట్రార్ ఇద్దరూ సైన్సు విభాగాల్లో పరిశోధనలు చేసిన వారు అయి ఉండి, మృత్యుంజయ హోమం పేరుతో అశాస్త్రీయ కార్యక్రమానికి సిద్ధపడడం సరికాదన్నారు. వెంటనే యూనివర్సిటీలో మృత్యుంజయ హోమాన్ని నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై లౌకిక, ప్రజాతంత్ర వాదులందరూ స్పందించాలని ఆయన కోరారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం
మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్.

శాస్త్రీయ ఆలోచనలను విద్యార్థి దశ నుంచే పెంపొందించాలని భారత రాజ్యాంగం సూచిస్తోంది. కాని అందుకు విరుద్ధంగా ఎస్‌కెయులో విసి, రిజిస్ట్రార్‌లు మృత్యుంజయ హోమం నిర్వహించడం అన్నది ఆ స్ఫూర్తిగా విరుద్ధంగా నిలుస్తాయి. విశ్వవిద్యాలయాలు అంటే ఆధునిక భావాలక, శాస్త్రీయ ఆలోచనలకు కేంద్రాలుగా ఉంటాయి. అనారోగ్యాల పేరుతో ఇటువంటి హోమాలను నిర్వహించడం ద్వారా ప్రయోజనం ఏమీ ఉండదు. అనారోగ్య సమస్యలుంటే ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించుకునే విధంగా చర్యలు తీసుకోవాలి గానీ, ఇటువంటి హోమాలతో విశ్వవిద్యాలయంలో మార్పులు జరగవని గ్రహించాలి.

విసి, రిజిస్ట్రార్‌ను తొలగించాలి
సూర్యసాగర్, జనసాహితీ సంస్థ.

మూఢ విశ్వాసాలను విద్యార్థుల్లో పెంచే విధంగా వ్యహరించిన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లను తక్షణం పదవి నుంచి తొలగించాలి. పౌర సమాజాం కూడా ఇటువంటి చర్యలను ఉపేక్షించరాదు. దీనికి వ్యతిరేకంగా గొంతెత్తాలి. ప్రభుత్వం తక్షణం స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలి.

హోమాలతో ప్రాణాలు నిలవవు..
తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, మానవతా రక్తదాతల సంస్థ.

మృత్యుంజయ హోమాలు చేపట్టడం ద్వారా ఎవరి ప్రాణాలు నిలబడవన్నది అందరికీ తెలిసినదే. ఇటువంటి సమయంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎటువంటి సందేశాన్ని విసి, రిజిస్ట్రార్‌లు ఇవ్వాలనుకున్నారో... విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే విధంగా వ్యవహరించాల్సిన అధ్యాపకులు ఈ రకంగా వ్యవహరించడం సరైంది కాదు. ఇప్పటికే భూతవైద్యం పేరుతో కోర్సులు, వాస్తు, జ్యోతిష్యం వంటి అశాస్త్రీయ కోర్సులను విద్యాలయాల్లో అమలు చేస్తున్నారు. ఇది మరింత తారా స్థాయికి చేర్చి హోమాలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి వాటిని అరికట్టే చర్యలు చేపట్టాలి.

విద్యాలయాల్లో ఇలాంటివి తగదు..
గోవిందరాజులు, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్.

పూజలు, హోమాలు నిర్వహించుకోవడం అన్నది వ్యక్తిగతమైన అంశాలుగా ఉండాలి.అటువంటి వాటిని విద్యాలయాల్లో అధికారికంగా నిర్వహించడం సరైంది కాదు. విద్యాలయాలు కులాలు, మతాలకు అతీతంగా ఉండాలని రాజ్యాంగం సైతం సూచిస్తోంది. వీటన్నింటినీ పక్కనబెట్టి అధికారిక హోదాలో నిర్వహించాలని తలపెట్టడం సరైంది కాదు.

లౌకిక స్ఫూర్తికి విరుద్ధం : సిఐటియు

శ్రీకృష్ణదేవరాయల విశ్వ విద్యాలయంలో నిర్వహించ తలపెట్టిన మృత్యుంజయ హోమం దేశ లౌకిక స్ఫూర్తికి విరుద్ధమని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్ర కుమార్‌లు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విశ్వవిద్యా లయంలో విజ్ఞానాన్ని పెంపొందించాల్సింది పోయి, ఇలా మూఢ నమ్మకాలను ప్రేరేపించేలా మృత్యుంజయ హోమం నిర్వహించడం సరికాదన్నారు. ఇతర మైనార్టీ వర్గాల భావాలను దష్టిలో పెట్టుకుని లౌకిక తత్వాన్ని మతసామరస్యాన్ని కాపాడే పద్ధతిలో యూనివర్సిటీలు ఉండాలన్నారు. తక్షణం మృత్యుంజయ హోమాన్ని రద్దు చేయాలని కోరారు.


విసికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు

హోమాన్ని అడ్డుకుంటాం

విద్యార్థి సంఘాలు

మూఢ విశ్వాసాలను ప్రోత్సహించేలా ఎస్‌కెయు అధికారులు చేపట్టిన మృత్యుంజయ హోమాన్ని ఆపకుంటే తామే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. హోమం నిర్వహణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్‌కెయు విసి రామకష్ణారెడ్డి ఛాంబర్ వద్ద సోమవారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర యాదవ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కార్యదర్శులు ఓతురు పరమేష్, బాబావలి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయిస్వామి, చిరంజీవి మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్ రామకష్ణారెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్యలు ఈ నెల 24వ తేదీన యూనివర్సిటీలో మత్యుంజయ హోమాన్ని జరపాలని నిర్ణయించడం సరికాదన్నారు. ఇందుకోసం డబ్బులను సైతం వసూలు చేసేలా సర్క్యులర్ జారీ చేశారన్నారు. ఉన్నత విద్యకు నిలయమైన ఎస్‌కెయులో ఇలా మూఢనమ్మకాలను ప్రోత్సహించడం సరికాదన్నారు. ఇది దేశ లౌకిక భావాలను దెబ్బతీసే విధంగా ఉందన్నారు. తక్షణం మత్యుంజయ హోమాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే 24న జరిగే హోమాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

చెర్లోపల్లి కాలనీలో తాగునీరు సరఫరా


కొళాయిల మర్మతులు చేస్తున్న అధికారులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని తాగునీటి ఎద్దడిపై ఆదివారం ప్రజాశక్తి పత్రికలో 'గుత్తిలో సమస్య జఠిలం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకూ అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి స్పందన లభించింది. సోమవారం తెల్లవారుజామున మరమ్మతులకు గురైన స్పాట్ డెలివరీ ట్యాంకును మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు, మెకానిక్ తో కలిసి మరమ్మతులు చేసి చెర్లోపల్లి కాలనీలోని సుంకులమ్మ ఆలయం, కొల్లాపూరమ్మ ఆలయం, గంగమ్మ గుడి వీధుల్లోని కొళాయిలకు తాగునీరు సరఫరా చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయం చేస్తారా.. పురుగుల మందు తాగమంటారా..!

తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన


తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-ఉరవకొండ

'మాకు న్యాయం చేస్తారా.. పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకోమంటారా..' అంతూ పలువురు రైతులు సోమవారం విడపనకల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాలలోకి వెళ్తే.. విడపనకల్ మండల కేంద్రంలో జయరామ్ అనే వ్యక్తి 40 సెంట్ల స్థలాన్ని కబ్జా చేశాడని బాధితులు లక్ష్మీనారాయణ, వన్నూరప్ప, నారప్ప పురుగుల మందు డబ్బాతో తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారుల ముందు తాగేందుకు యత్నించారు. రెవెన్యూ అధికారుల అండదండలతోనే తమ స్థలాన్ని తమకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితులు ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడంతోపాటు అధికారులు నానా దుర్భాషలాడారని లక్ష్మీనారాయణ వాపోయాడు. గతంలో కోర్టు ద్వారా ఇంజెక్షన్ ఆర్డర్ ఇచ్చిన విషయాన్ని పెడచెవిన పెట్టి ఏకపక్ష నిర్ణయంతో భూమి కొలతలకు నోటీసు జారీ చేయడం సమంజసం కాదన్నారు. అంతలోనే పురుగుల మందు తాగేందుకు యత్నించగా అక్కడే ఉన్న కొందరు రైతులు జోక్యం చేసుకుని ఆవేశంతో ఇలాంటి చెడ్డ ఆలోచన చేయరాదని, అధికారులతో పనులు చేయించుకోవాలని సముదాయించారు. అంతేగాకుండా రెవెన్యూ అధికారులు స్పందించి తహశీల్దార్ సెలవులో ఉన్నారని, వస్తానే విచారించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆస్తి తగాదాలతోనే జంటహత్యలు

9 మంది నిందితులు అరెస్టు - డీఎస్పీ యు.నరసింగప్ప


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ యు.నరసింగప్ప

ప్రజాశక్తి-గుంతకల్లు

ఆస్తి తగాదాల నేపథ్యంలోనే ఈనెల 14న గుంతకల్లులో జంటహత్యలు జరిగాయని డీఎస్పీ యు.నరసింగప్ప తెలిపారు. మంగళవారం స్థానిక 2వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్ధాలుగా పాత గుంతకల్లుకు చెందిన మంతకల్‌రెడ్డి కుమారులు జిపి.హేమ కోటిరెడ్డి, భాస్కరరెడ్డి, నీలకంటారెడ్డి, అలాగే కేశవరెడ్డి కుమారులు ప్రభాకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి మధ్య ఆస్తుల పంపకాల్లో విభేదాలు ఉన్నాయి. ఈ విషయంలో ఇరువురూ ఒకరిపై ఒకరు క్రిమినల్ కేసులు పెట్టుకోవడంతోపాటు కోర్టుకు కూడా వెళ్లారు. ఈ క్రమంలో నీలకంఠారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి చనిపోయారు. అప్పటి నుంచి హేమ కోటిరెడ్డి, సుధాకర్ రెడ్డి మధ్య ఆస్తి విభేదాలు మరింత ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో సుధాకర్‌రెడ్డి తనకు రావాల్సిన ఆస్తులను రాకుండా హేమ కోటిరెడ్డి అడ్డు పడుతున్నాడని కక్ష కట్టి కొందరికి సుఫారీలు ఇచ్చి పలుమార్లు చంపాలని ప్రయత్నాలు చేశాడు. అయితే గతనెల క్రితం సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న హేమ కోటిరెడ్డి, అతని బంధువులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. దీంతో సుధాకర్‌రెడ్డి కొడుకు భరత్‌రెడ్డి, అతని తల్లి సుగుణమ్మ అలియాస్ నిర్మల, తన మేనమామలు దేవేంద్రరెడ్డి, గోవర్ధన్‌రెడ్డితోపాటు తమ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న పని మనుషులతో కోటిరెడ్డి చంపడానికి పథకం రచించుకున్నారు. ఈనేపథ్యంలో విదేశాలకు వెళ్లిన కోటిరెడ్డి గత 15 రోజుల క్రితం గుంతకల్లుకు వచ్చాడు. దీంతో పక్కాగా రెక్కీ నిర్వహించి స్థానిక కథల వీధిలో నివాసం ఉంటున్న సుధాకర్‌రెడ్డి చెల్లెలు మాలతీ, ఆమె కొడుకు అబ్దుల్లా, సుధాకర్‌రెడ్డి తోటలో పనిచేస్తున్న మల్లేనిపల్లి గోవిందు సాయంతో కోటిరెడ్డి కదిలికలను తెలుసుకున్నారు. ముందుగా రూపొందించుకున్న పథకం ప్రకారం ఈనెల 15న ఇంట్లో ఉండగా కోటిరెడ్డిని, అడ్డుకోబోయిన డ్రైవర్ షేక్షావలిని కత్తితో పొడిచి చంపినట్లు వివరించారు. ఈనేపథ్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈఘటనలో ప్రధాన నిందితులైన పాటిల్ భారత్ సింహారెడ్డి, పాటిల్ సుగుణ, దీపం సుబ్బారాయుడు, ఈడిగ ప్రకాష్‌గౌడ్‌తో పాటు మరో ఐదుగురిని సోమవారం గుత్తి పట్టణంలోని 44వ జాతీయ రహదారి పక్కన బాట సుంకులమ్మ గుడి వద్ద సీఐలు గణేష్, రామ సుబ్బయ్య, ప్రత్యేక టీం సభ్యులు అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే హత్యలతో సంబంధం ఉన్న మరో ఆరుగురు పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామన్నారు. హత్యల ఘటనలో ఉపయోగించిన రెండు కార్లు, పల్సర్ ద్విచక్ర వాహనం, పిడి కత్తి, సిసి కెమెరాల హార్డ్ డిస్క్ బూడిదను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. త్వరలో నిందితులను కోర్టులో హాజరు పెడతామన్నారు. ఈ సమావేశంలో ఒకటి రెండవ పట్టణ సిఐలు గణేష్ రామ సుబ్బయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్సీ ఓటు కరపత్రాలు ఆవిష్కరణ

పుట్లూరు : మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఎంపిపి భూమిరెడ్డి గారి రాఘవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేస్తున్న వి.రవీంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తక్కలపల్లి సర్పంచి మహేశ్వర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, వైసిపి నాయకులు కందికాపుల శ్రీధర్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సర్వసభ సమావేశం కోరం లేకపోవడంతో మంగళవారానికి వాయిదా వేశారు. మండల వ్యాప్తంగా 11 ఎంపిటిసిలు ఉండగా ఎంపీపీతో ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశాన్ని ఎంపిడిఒ యోగానందరెడ్డి రేపటికి వాయిదా వేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రస్థాయి అండర్-14, 17 బాల బాలికల సెపక్‌తక్రా పోటీలు సోమవారం ముగిశాయి. పట్టణంలోని పోలీస్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14 బాలురు విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం కర్నూలు జిల్లా, 2వ స్థానం నెల్లూరు, 3వ స్థానంలో వెస్ట్ గోదావరి జిల్లాలు గెలుపొందాయి. అలాగే అండర్ 14 బాలికల విభాగంలో ప్రథమ స్థానం వెస్ట్ గోదావరి, 2వ స్థానం అనంతపురం, 3వ స్థానంలో కర్నూలు జిల్లాలు నిలిచాయి. అలాగే అండర్-17 బాలురు విభాగంలో ప్రథమ స్థానం వెస్ట్ గోదావరి, 2వ స్థానం అనంతపురం 3వ స్థానాన్ని నెల్లూరు జిల్లాలు కైవసం చేసుకున్నాయి. అండర్ 17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి మొదటి స్థానంలో అనంతపురం, 2వ స్థానంలో వెస్ట్ గోదావరి, 3వ స్థానాన్ని నెల్లూరు జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ఉరవకొండ ఎంపిడిఒ చంద్రమౌళి, మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, అర్బన్ సీఐ హరినాథ్, తదితరులు మెమొంటోలు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిఐ, ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు ఉరవకొండలోని పోలీస్ క్రీడా మైదానంలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని స్నేహ సంబంధాలను పెంచుతాయని విద్యతో పాటు క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెపక్‌తక్రా క్రీడా సంఘం జిల్లా అధ్యక్షులు, ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున, విశ్రాంతి ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు క్రిష్టప్ప, ఉమ్మడి అనంతపురం జిల్లాలకు చెందిన స్కూల్ గేమ్స్ కార్యదర్శులు రవికుమార్, అంజన్న, రాష్ట్ర పిఇటి అసోసియేషన్ ఉపాధ్యక్షులు నాగరాజు, సహాయ కార్యదర్శి సిరాజుద్దీన్, జిల్లా కార్యదర్శి మొరార్జీ యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మారుతీప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పప్పుశనగ కొనుగోలు ప్రారంభించాలి

జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ మద్దతు ధరతో రైతులు నుంచి మార్క్ ఫెడ్ సంస్థ పప్పుశెనగ పంటను వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ ఆదేశించారు. సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల గురించి జిల్లా వ్యవసాయ అధికారి చదివి వినిపించారు. తర్వాత అజెండా వారీగా వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ప్రగతి నివేదికను సభ్యులకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందు వల్ల జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులతో మాత్రమే జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈక్రాప్ నమోదుకు సంబంధించి రైతులతో తప్పనిసరిగా ఇకెవైసి త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే గిట్టుబాటు ధరతో పప్పుశెనగ కొనుగోలు చేయాలన్నారు. ఇందుకోసం రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి సీడ్స్ రీజినల్ మేనేజర్ ధనలక్ష్మి, డిఆర్‌సి ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, డివిజన్ ఎడిఎలు ఎం.వెంకటరాముడు, లక్ష్మనాయక్, ఓబుళపతి, యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

వారంలో 103 సెల్‌ఫోన్లు రికవరీ

బాధితులకు అందజేసిన ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం సిటీ : జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 103 మొబైల్ ఫోన్లను ఈవారంలో రికవరీ చేసినట్లు ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. ఈమేరకు సోమవారం నగరంలోని జిల్లా ఎస్పీ పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో బాధిత కుటుంబాలకు సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ సేవలు ప్రవేశపెట్టినప్పటి నుంచి 5,325 సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రికవరి చేసి బాధితులకు అప్పజెప్పిన మొబైల్ ఫోన్ల విలువ సుమారు రూ. 8.63 కోట్లు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, టెక్నికల్ విభాగం ఎస్ఐ సుధాకర్‌యాదవ్, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను అందుకునేందుకు వచ్చిన బాధిత ప్రజలు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్యశిబిరం

ఉరవకొండ : వజ్రకరూరు మండల కేంద్రంలోని టిడిపి కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వజ్రకరూరు జడ్పిటిసి తేజేశ్వరి రమేష్, కురుబ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు వసకేరి రమేష్‌బాబు, ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతారాం ఆసుపత్రి సౌజన్యంతో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సహకారంతో ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరంలో గుండె, కంటి ఆపరేషన్లు, మోకాలు, భుజం, మెడకు సంబంధించిన సమస్యలకు శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

పిఆర్ఆర్ కళాశాలలో జాబ్‌మేళా


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

గుత్తి : పట్టణంలోని పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాలలో ఫన్నెల్ మూవీంగ్ నీడిల్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈమేళాకు 62 మంది విద్యార్థులు హాజరుకాగా కంపెనీ ప్రతినిధుల రాత పరీక్ష, బృంద చర్చల అనంతరం 11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి డిగ్రీ కళాశాల సీఈవో ఎ.శ్రీరాములు, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నకుమార్, క్యాంపస్ ప్లేస్‌మెంట్ అధికారి బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గుత్తి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P.No.21/2021 O.S.156/2013
Between:
కె.ఆదెప్ప @ ఆదినారాయణ ...డిక్రీ హోల్డరు
V/s
కె.సరళమ్మ వగైరా ...జడ్జిమెంటు డెట్టార్లు
To,
కుమ్మర సరళమ్మ W/o లేటు శివయ్య, మాముదూరు, గుత్తి (మం॥).
J.Dr No.1కు OR21 R22, C.P.C. నోటీసు
ఇ.పి. షెడ్యూలు దాఖలాస్థిని కోర్టుద్వారా విక్రయించి తనకు రావలసిన ఇ.పి.లో కనబరచిన మొత్తము వసూలు చేసుకొనుటకు, డిక్రీహోల్డరు ఇ.పి. దాఖలు చేసియున్నారు. అందులకు నకు ఆక్షేపణలున్న యెడల 23-02-2023వ తేదీన స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టుయందు ఉదయం 10.30 గం॥లకు హాజరుకావలెను. లేని యెడల నీ పరోక్షము నందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
జి.శ్రీకాంత్‌రెడ్డి, డి.హెచ్ఆర్ వకీలు
గుత్తి.

In the Court of the IInd Addl. Junior Civil Judge: Anantapuramu
O.S.No.1132/2021
Between:
N.Prabhakar ...Plaintiff
And
T.John Moness ...Defendant
Notice to Defendant
To,
T.John Moness S/o T.Moness, D.No.1-182-A4, Hampaiah Colony, Modinabad, Guntakal, Anantapur Dist.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 20-03-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
హెచ్.రామసుబ్రమణ్యం, అడ్వకేటు
అనంతపురం.

In the Court of the Prl District Judge: Anantapuramu
E.A.15/2022 in E.P.519/2019 in O.S.No.151/2018
Between:
Endla Prathap Reddy and others ...Claim Petitioners
And
1.Diddukuri Pullappa (D.Hr)
2.Inuguri Venkata Seshaiah (J.Dr) ...Respondants
Notice to Respondant No:2
To,
R2: Inuguri Venkata Seshaiah S/o Krishnamurthy Residing at D.No.21/73, Bhupalam Veedhi, Anantapuramu City (Judgement Debtor)
పై నెంబరు కేసులో జె.డిఆర్2 అయిన మీ హాజరు నిమిత్తం 23-02-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
పి.క్రిష్ణస్వామి కుమార్, అడ్వకేటు
అనంతపురం.

In the Court of the 1st Addl. Junior Civil Judge: Anantapuramu
O.S.No.1461/2019
Between:
J.Suresh Kumar ...Plaintiff
And
Shaik Mahammad Hidayathullah ...Defendant
Notice to Defendant
To,
Shaik Mahammad Hidayathulla S/o S.I. Khalelullah, Business, R/at D.No.22-179, Mahaldar Street, Oldtown, Anantapuramu.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 28-02-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
ఎ.సురేష్ కుమార్, వాదిపరం వకీలు
అనంతపురం.

మహారాజశ్రీ గుత్తి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P.No.10/2019 O.S.No.124/2017
Between:
కె.సత్య గోవిందయ్య ...డిక్రీ హోల్డరు
V/s
అంబటి వెంకటరాముడు S/o లచ్చన్న, వ్యాపారము, క్రిష్టపాడు, పెద్దవడుగూరు (మం॥) ...జడ్జిమెంటు డెట్టారు
J.Drకు OR21 R54, C.P.C. నోటీసు
డిక్రీ హోల్డరు తనకు వసూలు కావలసియున్న డిక్రీ మొత్తమును వసూలు కొరకు నీ స్వాధీనానుభవములో యున్న ఇ.పి. షెడ్యూలు ఆస్తిని కోర్టు ద్వారా జప్తుచేసియున్నారు. అందులకు నీకు ఆక్షేపణలున్న యెడల 23-02-2023వ తేదిన ఉ॥10.30 గం॥లకు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టుయందు హాజరుకావలెను. అట్లు హాజరుకాని యెడల నీ పరోక్షము నందు ఇ.పి.ను విచారించి తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
జి.శ్రీకాంత్‌రెడ్డి, డి.హెచ్ఆర్ వకీలు
గుత్తి.

In the Court of the 1st Addl. Junior Civil Judge: Anantapuramu
O.S.No.19/2020
Between:
Alam Narasa Naidu ...Plaintiff
And
M.Kalavathi and another ...Defendants
Notice to Defendant No.1&2
D1: M.Kalavathi W/o Narayanappa gari Ramaiah.
D2: M.Narayanappa gari Ramaiah S/o Narayanappa. Both are Residing at Manahalli Village, Pavagada Taluk, Tumkur District, Karnataka State.
పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం 23-03-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
బి.విజయకుమార్, బి.శ్రీహరి
అడ్వకేట్లు, అనంతపురం.

మహారాజశ్రీ గుత్తి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P.No.153/2019 O.S.94/2018
Between:
ఎస్.షేకున్ బీ ...డిక్రీ హోల్డరు
V/s
1.యుగాని వెంకటేశ్వర్లు S/o కంబయ్య, డోర్‌నెం.8-198, కర్నూలు రోడ్డు, గుత్తి ఆర్.ఎస్., అనంతపురం జిల్లా.
2.గోగుల వెంకటరాముడు S/o హనుమంతు, డోర్‌నెం.5-167, నాలగడ్డ వీధి, గుత్తి ఆర్.ఎస్., అనంతపురం జిల్లా. ...జడ్జిమెంటు డెట్టార్లు
J.Drలకు OR21 R35, C.P.C. నోటీసు
పై కోర్టు డిక్రీ మేరకు ఇ.పి. షెడ్యూలు ఆస్తిని తన పేర రిజిష్టరు చేయించనందున డిక్రీ హోల్డరు కోర్టుద్వారా మీకు యిరువురుకూ నోటీసులు జారీ చేసియున్నారు. అందులకు మీకు ఆక్షేపణలున్న యెడల 23-02-2023వ తేదిన ఉ॥10.30 గం॥లకు పై కోర్టుయందు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరుకావలెను. అట్లు హాజరుకాని యెడల కోర్టువారు పై అర్జీని పరిశీలించి తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
జి.శ్రీకాంత్‌రెడ్డి, డి.హెచ్ఆర్ వకీలు
గుత్తి.

లింగవివక్ష నిర్మూలనపై అవగాహన సదస్సు


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని నెరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.ఎండీ, షఫీ లింగ వివక్షపై సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా లింగవివక్ష నిర్మూలన,కీటక జనిత వ్యాధులపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది తల్లిదండ్రులు తమ సంతానంలో మగ పిల్లల పట్ల మక్కువ చూపి ఆడపిల్లల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తుంటారన్నారు. ఇది సరికాదన్నారు. ముఖ్యంగా చిన్న వయసులోనే పెళ్లి చేయడం వల్ల కలిగే అనర్థాలకు గురించి వివరించారు. బాల్యవివాహాల వల్ల చదువు పాడవుతుందన్నారు. పసితనంలో గర్భధారణ జరిగితే ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. కావున చదువుపై దృష్టి సారించి భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.ఎండీ షఫీ మాట్లాడుతూ ఆడ, మగ తేడాలు సరికాదన్నారు. ఆడపిల్లలు లేనిదే సృష్టి లేదన్నారు. సమాజంలో సమతౌల్యాన్ని కాపాడాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే కిటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.పెద్దన్న, ఎఎన్ఎం లలితమ్మ, ఎంఎల్‌హెచ్‌పి.నాగసురేఖ, సిఓ భగవాన్ దాస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసేవలో జగనన్నకు తోడుగా ఉందాం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రజాసేవలో ముఖ్యమంత్రి జగన్‌కు తోడుగా ఉందామనిఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని చెరువు కట్ట కింద ఉన్న సాయిబాబా కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. ప్రతి 50 కుటుంబాల్లో ప్రజలకు అందుతున్న పథకాలు, వారి సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వం తరుపున మరింత చేరువయ్యే విధానాలను స్క్రీన్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జగనన్న తన పాదయాత్రలో ప్రజల కష్టాలు చూసి ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశాడన్నారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు ద్వారా చేకూరిన లబ్ధి, బ్యాంకు ఖాతాకు జమ చేయబడిన నగదు వంటి వివరాలు తెలియజేస్తూ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, నియెజకవర్గ పరిశీలకులు రాజారెడ్డి, ఆలూరు రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం సూపర్ వైజర్, సేల్స్‌మెన్లపై వేటు..?

ప్రజాశక్తి-కణేకల్లు

కణేకల్లు బస్టాండ్ ప్రాంతంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేస్తున్న ఓ సూపర్‌వైజర్, సేల్స్‌మెన్‌లపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు వేటు వేయనున్నట్లు సమాచారం. ఇరువురూ బాధ్యతా రాహిత్యంగా పని చేస్తూ ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పడిపోయేలా చేసినట్లు తెలుస్తోంది. ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటలకు మద్యం దుకాణాలను నడపాలి. ఈసమయంలో భోజనానికి వెళ్లాలంటే సూపర్‌వైజర్, సేల్స్‌మెన్లు సమయాన్ని సర్దుబాటు చేసుకోవాలి. అయితే వీరిద్దరూ సమయ పాలన పాటించకుండా ఎప్పుడు పడితే అప్పుడు మద్యం దుకాణం నుంచి వెళ్లిపోతున్నట్లు సమాచారం. దీంతో చాలామంది మందుబాబులు దుఖానికి రావడం లేదని తెలుస్తోంది. వీరి నిర్వాకం వల్ల మద్యం దుకాణ ఆదాయం భారీగా పడిపోయినట్లు సమాచారం. అంతేకాక ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారులు పలుమార్లు తనిఖీకి వచ్చిన సమయంలో కూడా వీరిద్దరూ దుకాణంలో లేకపోవడంతో ఆగ్రహించిన అధికారులు తీరు మార్చుకోమని హెచ్చరించినా ఫలితం లేకుండా పోయినట్లు తెలుసోంది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం అధికారులు తనిఖీకి రాగా వీరు విధుల పట్ల మరోసారి నిర్లక్ష్యం బయటపడినట్లు సమాచారం. దీంతో మీరు పని చేయాల్సిన అవసరం లేదని నోటీసులు ఇచ్చినట్లు తెల్సింది. అంతేగాక జిల్లాకేంద్రంలోని డిపోకు రావాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయమై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్ఐ ఆంజినేయులుకు ప్రజాశక్తి వివరణ కోరగా ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేస్తున్న ఓ సూపర్‌వైజర్, సేల్స్‌మెన్ బాధ్యతారాహితంగా విధులు నిర్వహిస్తున్న విషయం వాస్తవమేనన్నారు. వీరి వల్ల ఆదాయం బాగా పడిపోయిందన్నారు. దీంతో నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.


మేజర్ పంచాయతీ కార్యదర్శి వినతిపత్రం ఇస్తున్న దశ్యం

పాఠశాలల ముందు వేగ నియంత్రికలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల, ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల, బాలికల పాఠశాల సమీపంలో ఉన్న ప్రధాన రోడ్డులో వేగ నియంత్రికలను ఏర్పాటు చేయాలని సీనియర్ పాత్రికేయులు లక్ష్మీనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనారాయణ, సర్పంచి సుప్రియకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల ముందు ప్రధాన రహదారిపై ఉండటంతో వాహనాలు అత్యంత వేగంగా వెళ్తుంటాయన్నారు. ఫలితంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కావున మీరైనా స్పందించి వేగ నియంత్రికలను ఏర్పాటు చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

మర్రిమాకులపల్లిలో అగ్నిప్రమాదం

కళ్యాణదుర్గం : కంబదూరు మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామంలో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తొలత గ్రామ సమీపంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో సాగుచేసిన చింతవనంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. తర్వాత వనం పక్కనే ఉన్న సరోజమ్మ సాగు చేసిన మొక్కజొన్న పంటకు మంటలు పాకడంతో పాక్షికంగా కాలిపోయింది. దీంతో రైతుకు సుమారు రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.

గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకున్న పరిటాల శ్రీరామ్

నార్పల : మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామిని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. టిడిపి జాతీయ కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు పరిటాల శ్రీరామ్ తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో మాజీ జెడ్పిటిసి జాఫర్‌వలి, కుళ్లాయిస్వామి దేవస్థానం మాజీ అధ్యక్షులు రాజన్న, ఓబులేసు, నరసింహులు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కభజన బృందానికి అభినందన

ఉరవకొండ : మండలంలోని రేణిమకులపల్లి గ్రామానికి చెందిన సుంకులమ్మ తల్లి చెక్కభజన బృందం చెక్కభజన పోటీలో జిల్లాలో మొదటి బహుమతి సాధించడంతో బృందాన్ని సర్పంచి బోయ రామాంజనేయులు సోమవారం అభినందించారు. ఈనెల 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని పెద్దవడుగూరు మండలం చిన్నఒడుగూరు గ్రామంలో జిల్లాస్థాయి చెక్కభజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రేణిమాకులపల్లి గ్రామానికి చెందిన చెక్కభజన వృందం మొదటి బహుమతి రూ.25 వేలు సాధించడంతో సర్పంచితోపాటు గ్రామస్తులు అభినందించారు.

గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి అమానుషం

శింగనమల : గన్నవరం టిడిపి కార్యాలయంపై వైసిపి గూండాలు, కార్యకర్తలు దాడి చేయడం అమానుషమని టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. టిడిపి నాయకుడు చిన్నాపై దాడికి నిరసనగా ఉదయం పోలీస్‌స్టేషన్‌లో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు చేయడాన్ని జీర్ణించుకోలేని స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాడి చేయించాడని ఆరోపించారు. ఇలాగే కొనసాగిస్తే 2024లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

మక్కాకు వెళ్తున్న వారికి వీడ్కోలు

రాయదుర్గం : పట్టణానికి చెందిన మహమ్మద్ షఫీ, అమానుల్లా, ఫయాజ్ కుటుంబ సభ్యులతోపాటు ఉమ్రావ్ (మక్కా మదీనా) యాత్రకు వెళ్తున్న సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు వీడ్కోలు పలికారు. ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు ఇనాయత్, మహమ్మద్ రఫీ, ఫైరోజ్ తదితరులు యాత్ర సుఖవంతం కావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

విద్యార్థినులకు ఆరోగ్యపరీక్షలు


విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి జెవి.శ్రీధర్

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని మాలాపురం గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రభుత్వ వైద్యాధికారి జె.వి.శ్రీధర్ ఆరోగ్య సోమవారం విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహారం వల్ల వచ్చే లోపాలు, పలు వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ముగ్గురు విద్యార్థినులను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి సిఫారసు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ప్రమీలాదేవి, ఆరోగ్య పర్యవేక్షకురాలు జయభారతి, ఆరోగ్య కార్యకర్త బి.లక్ష్మి, నూర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రంగస్వామి రథోత్సవం

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ గ్రామంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం ఎస్.రంగనాథ స్వామి రథోత్సవాన్ని భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం పవిత్ర గంగను మేళతాళాలతో ఆలయానికి తీసుకొచ్చి స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించారు. తర్వాత ప్రత్యేక అలంకరణ చేసి మహిళలు కలశాలను అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని రథంపై ఆసీనులు చేసి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అరటిపళ్లను రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు లోకేష్, టిడిపి నాయకుడు సోమనాథ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పదవుల కేటాయింపులో నాయీబ్రాహ్మణులకు అన్యాయం

శింగనమల : నాయీబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తానని హామీ ఇచ్చిన సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని విస్మరించారని టిడిపి బిసి సెల్ నాయకులు ఎం.ఆదినారాయణ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి సుమారు నాలుగేళ్లు అవుతున్నా నాయీ బ్రాహ్మణులకు ఎలాంటి పార్టీ పదవిగానీ, రాజకీయ ప్రాధాన్యతగానీ, నామినేటెడ్ పదవుల్లో గానీ అవకాశం కల్పించకుండా అణగదొక్కడం బాధాకరమన్నారు. నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి సంబంధించి ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయని ఏకైక సిఎం జగన్ అన్నారు. బీసీలకు 86 శాతం హామీలు అములు చేశామని చెప్పుకుంటున్న వైసిపి నాయకులు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బిసిల ఓటుబ్యాంకులో రెండో స్థానంలో ఉన్న నాయీబ్రాహ్మణ కులానికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. గత టిడిపి హయాంలో నాయీ బ్రాహ్మణులకు అత్యధిక ప్రాధాన్యత కల్పించిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా సిఎం స్పందించి నాయీబ్రాహ్మణులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసిక వికాసం

ఒపిటిఆర్ఐ స్పోర్ట్స్ మీట్‌లో జెఎన్‌టియు విసి రంగ జనార్ధన



ఒపిటిఆర్ ఐ స్పోర్ట్స్‌ను ప్రారంభిస్తున్న జెఎన్‌టియు విసి రంగ జనార్ధన

అనంతపురం : క్రీడలు మానసిక వికాసానికి తోడ్పడుతాయని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన అన్నారు. సోమవారం జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక, పరిశోధన సంస్థ వారికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను విసి జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా వారికోత్సవ వేడుకల బ్యానర్‌ను ఆవిష్కరించి, శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల శారీరక, మానసిక అభివృద్ధి లభిస్తుందన్నారు. అంతేగాకుండా క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈపోటీలను వ్యాయామ ఉపాధ్యాయుడు ధనుంజయ, ఎం.మహేష్, మధు, తిరుమలనాయక్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, సంస్థ బోధన, భోధనేతర, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.